# సమయస్ఫూర్తి

**'వంద కాదు,** వెయ్యి కాదు. వెధవది రెండున్నర. అందుకు అంత అబద్ధం ఆడాలా? అడిగితే ఇవ్వనూ? చూస్తే చదూకున్న వాడిలా ఉన్నాడు. ఇదేం బుద్ధి? వంద మార్లైనా ఆముక్క అనుకుని ఉంటాడు రాజారాం.

సరిగ్గా వారంరోజుల క్రిందట జరిగిన సంఘటన మరోసారి మదిలో మెదిలింది.

కూతుర్నీ, అల్లుణ్ణి చూడాలని విశాఖపట్నం బయలుదేరాడు రాజారాం. ఆ రోజు బస్సులో ప్రయాణికులంతగా లేరు. కదిలి పోతున్న తరుల్నీ, గిరుల్నీ చూస్తూ ప్రయాణించడం అంటే రాజారాంకెంతో ఇష్టం. అందుకే కిటికీ దగ్గర కూర్చున్న అబ్బాయిని ముందుకు రమ్మని చెప్పి ఆ సీట్లో అడ్జస్టయిపోయాడు. అతడికి ఇరవై ఏళ్ళకంటే ఎక్కువ ఉండవు. సన్నగా పొడవుగా ఉన్నాడు. జీన్స్ ఫాంట్, తెల్లని చొక్కా వేసుకున్నాడు. చేతిలో ఏదో ఫైలుంది.

కండక్టరు దగ్గరకు రాగానే "విశాఖ పట్టణానికి ఒక టిక్కట్టివ్వండి" అన్నాడు రాజారాం, పర్సు తెరచి పది కాగితం తీసిచ్చి.

చిల్లర లేనట్లుంది. ముఖం అదోలా పెట్టి పక్కన కూర్చున్న జీన్స్ ఫాంట్ అబ్బాయి వంక చూసాడు కండక్టరు.

"వైజాగ్‌కు ఒక టిక్కట్టు" ఆ అబ్బాయి కూడా పదిరూపాయల కాగితమే ఇచ్చాడు. కండక్టరు ఇద్దరికీ చెరో టిక్కట్టు ఇచ్చీ కుర్రాడి చేతిలో ఐదురూపాయల కాగితం పెడుతూ, " దిగగానే మార్చి ఈయనకు రెండున్నర ఇవ్వండి" అని చెప్పి ముందుకు సాగిపోయాడు, మిగిలిన వాళ్ళకు టిక్కట్లివ్వడం కోసం.

చిల్లర సమస్య తలెత్తి నప్పుడు ఇద్దరేసి ప్రయాణికులకు డబ్బులు ముడిపెడుతూ ఉంటారు కండక్టర్లు.

కండక్టరిచ్చిన ఐదు రూపాయల కాగితాన్ని బద్రంగా జేబులో కుక్కుకుంటూ "విశాఖపట్నంలో మీరెక్కడకి వెళ్ళాలి?" అడిగాడు ఆ అబ్బాయి నవ్వుముఖం పెట్టి.

చిరునామా చెప్పాడు రాజారాం.

మరి వారి మధ్య మాటల్లేవు. గంట తరువాత గమ్యస్థానం చేరింది బస్సు.

జీన్స్ ప్యాంటు అబ్బాయి బస్సు దిగి వడివడిగా ముందుకు నడిచాడు.

చిల్లర మార్చేందుకు దుకాణానికెళుతున్నాడనుకుని అతన్ని అనుసరించాడు రాజారాం.

అయితే ఆ ధ్యాస అతనిలో ఉన్నట్లు కనిపించక పోవడంతో, "ఏయ్ అబ్బాయ్!" బిగ్గరగా కేక పెట్టాడు.

ఆగాడు జీన్స్ ఫ్యాంటబ్బాయి.

" నా రెండున్నర...?"

రాజారాం మాటలకు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టాడు ఆ కుర్రాడు.

"అదేనయ్యా. బస్సులో కండక్టరు నాకిమ్మన్న..."

"డబ్బులా? ఎవరి కివ్వాలో ఏమిటో సరిగ్గా గుర్తుకు తెచ్చుకోండి"

అప్పటికే రాజారాం దిగిన బస్సు వెళ్లిపోయింది. అక్కడున్న వాళ్లంతా అతని వంక వింతగా చూస్తున్నారు. జీన్స్ ఫ్యాంటబ్బాయి తనకు రెండున్నర ఇవ్వాలని గట్టిగా చెప్పేందుకు తన వద్ద ఆధారాలు లేవు. అందుకే మనసు మండిపోతున్నా మారు మాట్లాడకుండా వెళ్ళిపోయాడు రాజారాం.

★ ★ ★

గేటు తీసుకుని లోపలికి వస్తున్న అబ్బాయిని చూసాడు రాజారాం.

ఆశ్చర్యం! ఆ కుర్రాడే! సందేహం లేదు.

ఆ రోజు తనకు రెండున్నర ఎగనామం పెట్టి ఉడాయించిన అబ్బాయి!

చేతులు జోడించాడు వచ్చిన వ్యక్తి. అతని వందనాన్ని అందుకోడానికి రాజారాం మనస్సు అంగీకరించడం లేదు. ఎందు కొచ్చావన్నట్లు చిరాగ్గా చూశాడు.

"ఆ రోజు మిమ్మల్ని బుకాయించి రెండున్నర తీసుకెళ్ళినందుకు క్షమాపణ చెప్పుకుందామని"

మాట్లడలేదు రాజారాం. భగభగ మండే బడబాగ్నిని చిటికెడు నీళ్లు చల్లార్చ లేవు కదా!

"నాటి నా అవసరం నన్నంత హీనస్థితికి దిగజార్చింది. పదకొండు గంటలకు ఇంటర్వ్యూకు హాజరవవలసిన నేను పదీ యాభై నిముషాలకు విశాఖలో అడుగు పెట్టాను. సిటీ బస్సుకోసం నిరీక్షిస్తే పన్నెండైపోవడం ఖాయం. ఇంటర్వ్యూకే పంక్చువాలిటీ పాటించ లేకపోతే, నన్ను మిలిటరీ వాళ్ళెలా రిక్రూట్ చేసుకుంటారు? టైము విషయంలో అర్హత కోల్పోయిన వాడి నవుతానేమో నన్న బెదురుతో ఆటోలో వెళ్లాలని నిర్ణయించుకున్నాను. నా దగ్గరున్న డబ్బుకు ఈ రెండున్నరా కలిపితే తప్ప ఆటోలో వెళ్లలేని పరిస్థితి. అందుకే అలా చేయవలసి వచ్చింది. నేను ఇంటర్వ్యూలో సెలెక్టయ్యాను. పోస్టింగ్ ఆర్డరు కూడా వచ్చింది. నా ఉన్నతికి మీరే కారకులు. పరోక్షంగా మీరు చేసిన ఉపకారం ఈ జన్మకు మరిచిపోలేను. మీ ఆశీర్వాదం కోసం వచ్చాను" స్వీటు ప్యాకెట్టు బల్లమీద పెడుతూ, రాజారాం పాదాల్ని స్పృశించాడు ఆ అబ్బాయి.

తన రెండున్నర ఒక పేదవాడి ఉజ్వల భవిష్యత్తుకు ఉపకరించిందని తెలియగానే ఎంతగానో సంతోషించాడు రాజారాం. ఈ తరం యువతలోని సమయస్ఫూర్తిని లోలోన మెచ్చుకున్నాడు. అంత వరకు ప్రజ్వరిల్లుతున్న హృదయాగ్ని చప్పున చల్లారిపోయింది.

**(15 సెప్టెంబరు 1997, ఆంధ్రప్రభ వీక్లీ)**